# సాక్షి శ్రీకాకుళం

గురువారం । 18 ఏప్రిల్ । 2024






## 19న తిలక్ నామినేషన్

వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్ 19న నామినేషన్ వేయనున్నారు. అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో



## అప్పల బాధ తాళలేక..

అప్పల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. అతనిది వప్పంగి గ్రామం.

- 8లో



## ఉత్సాహంగా ఎంపికలు

జిల్లా కేంద్రంలో బాస్కెట్‌బాల్, క్రికెట్ జట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి.

- 8లో

## న్యూస్‌రీల్

### రిటర్నింగ్ అధికారులు వీరే

2024 సమరం సన్నద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కావడంతో ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీకాకుళం పార్లమెంటుతో పాటు 8 శాసన సభా నియోజకవర్గాలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాలకు గాను ఆర్ఓలను నియమించి వారికి ఫోన్ నంబర్లు, కంట్రోల్ రూమ్ నంబర్లు అందుబాటులో ఉంచారు.

**ఇచ్ఛాపురం నియోజకవర్గం**
ఆర్ఓ పేరు బి.సుదర్శన దొర (ఎస్‌డీసీ)
ఫోన్ నంబర్ 9494326124
కంట్రోల్ రూం నంబర్ 9114115363

**పలాస**
ఆర్ఓ పేరు భరత్ నాయక్
ఫోన్ నంబర్ 8333989275
కంట్రోల్ రూం నంబర్ 6302384049

**టెక్కలి**
ఆర్ఓ పేరు నూరుల్ కమర్ (సబ్ కలెక్టర్)
ఫోన్ నంబర్ 8333988802
కంట్రోల్ రూం నంబర్ 9063757478

**పాతపట్నం**
ఆర్ఓ పేరు ఎం.అప్పారావు (ఎఫ్ఎస్ఓ)
ఫోన్ నంబర్ 9398764880
కంట్రోల్ రూం నంబర్ 8125213524

**శ్రీకాకుళం**
ఆర్ఓ పేరు సీహెచ్ రంగయ్య(ఆర్డీవో)
ఫోన్ నంబర్ 9573356699
కంట్రోల్ రూం నంబర్ 9032601471

**ఆమదాలవలస**
ఆర్ఓ పేరు ఎం.నవీన్, జేసీ
ఫోన్ నంబర్ 8143193111
కంట్రోల్ రూం నంబర్ 903218521
08942 286602

**ఎచ్చెర్ల**
ఆర్ఓ పేరు ఎస్‌వీ లక్ష్మణమూర్తి
ఫోన్ నంబర్ 9121251111
కంట్రోల్ రూం నంబర్ 08942 298767

**నరసన్నపేట**
ఆర్ఓ పేరు జీవీఎస్ఎస్ రామ్మోహనరావు
ఫోన్ నంబర్ 9440422302
కంట్రోల్ రూం నంబర్ 8331995443

**శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం**
ఆర్ఓ పేరు మనజీర్ జిలానీ సమూన్ (జిల్లా కలెక్టర్)
ఫోన్ నంబర్ 9849903786
కంట్రోల్ రూం నంబర్లు 08942 2406906
08942 240589
08942 295084
1800 4256625

### విశ్రాంత సైనికుడికి సత్కారం



శంకర్‌ను సత్కరిస్తున్న బ్రాహ్మణతర్లా యువత

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామంలో విశ్రాంత సైనికుడిని బుధవారం సత్కరించారు. గ్రామంలో పాత బస్టాండ్ వీధికి చెందిన మెట్ట శంకరరావు గత కొన్నేళ్లుగా భారతసైన్యంలో బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఆయనను బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్, భగత్‌సింగ్ గ్రంథాలయం కమిటీ సభ్యులు, గ్రామ యువకులు తదితరులు సత్కరించి గౌరవించారు.

### పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం : ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిందితులపై కోర్టులో చార్జిషీటు దాఖలయ్యేలా చూడాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రేవ్, ప్రాపర్టీ, ఎస్సీ, ఎస్టీ, పోక్సో వంటి ముఖ్య కేసుల దర్యాప్తు, పరిష్కారం, నేర నియంత్రణ వంటి అంశాలపై ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, ప్రాపర్టీ కేసులను త్వరగా ఛేదించాలన్నారు.

**ఎన్నికల సన్నద్ధత**

ఈ నెల 18 నుంచి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నిర్వహణ ఉన్నందున అధికారులు తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ప్రశాంతంగా నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎస్ఐలు, సీఐలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. ఎన్నికలు ముగిసేంతవరకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సీఐలు, డీఎస్పీలు ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు డి.బాలచంద్రారెడ్డి, యర్రగుంట శృతి, బి.నాగేశ్వరరెడ్డి, త్రినాథరావు, శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, ఎల్.శేషాద్రినాయుడు, పోలీస్ లీగల్ అడ్వైజర్ యామినీ రాణి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: రైల్వేస్టేషన్‌లోని రామాలయంలో మంత్రి సీదిరి దంపతుల పూజలు



వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో..



శ్రీకాకుళం కోదండ రామాలయంలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు



శ్రీకాకుళం కోదండ రామాలయంలో ఉత్సవ మూర్తులు

### వరుడు రామయ్య.. వధువు సీతమ్మ

వరుడు రామచంద్రుడు.. వధువు జానకీమాత. ఆలయ ఆవరణే పరిణయ వేదిక. భక్తులే పెళ్లి పెద్దలు. శ్రీరామ నవమి నాడు సీతారాముల కల్యాణ క్రతువు నిర్వహించి ఊరూవాడా మురిసిపోయాయి. సీతారాముల ఉత్సవ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించి, శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు.



ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ వద్ద ఎస్పీ రాధిక దంపతులు



అరసవల్లి రామాలయానికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

## నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ

- 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు
- 26న నామినేషన్ల పరిశీలన
- 27 నుంచి 29 వరకు ఉపసంహరణ
- సిద్ధమైన యంత్రాంగం





శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులంతా గురువారం నుంచి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు. జిల్లాలో శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గంతో పాటు ఎనిమిది శాసన సభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి నామినేషన్‌ను జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వీకరిస్తారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. అభ్యర్థులంతా ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సువిధ యాప్‌ను ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తీసుకు వచ్చింది. నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

**ముఖ్యమైన తేదీలివే..**

- సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను ఉదయం 11 నుంచి 3 గంటల లోపు సంబంధిత ఆర్‌ఓకు దఖలు పరచాలి.
- 26వ తేదీన అప్పటి వరకు వచ్చిన నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు పరిశీలిస్తారు.
- 27 నుంచి 29 వరకు నామినేషన్ల ఉప సంహరణకు అవకాశం ఉంటుంది.
- బరిలో మిగిలిన అభ్యర్థులకు మే నెల 13న పోలింగ్ జరుగుతుంది.
- జూన్ 4న ఓట్లు లెక్కించి విజేతలను ప్రకటిస్తారు. నామినేషన్ సమయంలో ఐదుగురు కంటే ఎక్కువ మంది ఉండకూడదు. అలాగే వంద మీటర్ల దూరంలో వాహనాలు, ఇతర జనాలు ఉండాలి. మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంది.

**నిబంధనలివి..**

- నామినేషన్‌ను సువిధ యాప్ ద్వారా దాఖలు చేసిన తర్వాత హార్డ్ కాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే క్రమంలో చాంబర్‌లోనికి అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు.
- అభ్యర్థులు తమ బి–ఫారం, ఎ–ఫారం ఒరిజినల్ అందించాలి. వీటిని నామినేషన్ గడువు ముగిసే రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోపు అందజేయవచ్చు.
- అభ్యర్థులు రెండు ఫొటోలను (ఒకటి స్టాంప్ సైజ్, మరొకటి పాస్‌పోర్టు సైజ్) నామినేషన్‌తో పాటు అందజేయాలి. అభ్యర్థి తన ఓటరు కార్డు, బలపరిచే వారి గుర్తింపు పత్రాలు ఇవ్వాలి.
- ఓ అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతిజ్ఞ తప్పనిసరిగా చేయాలి. ప్రతిజ్ఞ చేసిన ధ్రువీకరణ పత్రాలన్నీ తీసుకోవాలి.
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి తన సంతకం ఉండే విధానాన్ని విధిగా తెలియజేయాలి. అదే విధంగా బ్యాలెట్ యూనిట్‌లో తన పేరు ఎలా ముద్రించాలో వివరించి చెప్పాలి.
- అభ్యర్థి చెల్లించిన ధరావత్తుకు సంబంధించి రశీదుతో పాటు, ఎన్నికల ఖర్చును నమోదు చేసేందుకు నిర్ణీత నమూనాలో ఉన్న రిజిస్టర్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులుంటే, వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేయాలి. అందుకు అయ్యే ఖర్చు లెక్క చూపాలి.
- ఎన్నికల నామినేషన్ కేంద్రంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అభ్యర్థులు తమ సందేహాలను అక్కడ నివృత్తి చేసుకోవచ్చు.
- అన్ని పత్రాలను సువిధ అప్లికేషన్ (యాప్) ద్వారానే అందజేయాలి. ప్రచారానికి సంబంధించిన కార్యక్రమాలు, వాహనాలు, ఇతర వాటికి ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే అనుమతి ఇస్తారు..

**అందుబాటులో అఫిడవిట్‌లు**

- అభ్యర్థులకు సంబంధించిన అఫిడవిట్‌లు అందరికీ తెలిసేలా అందుబాటులో ఉంచుతారు. ప్రజలు కోరితే వాటిని ఉచితంగా అందజేస్తారు. ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటాయి.
- ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆ రోజు వచ్చిన నామినేషన్లపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కి తెలియజేస్తారు.
- నామినేషన్ల దాఖలు పారదర్శకంగా ఉండేలా ప్రక్రియను మొత్తం వీడియో తీస్తారు.

### అభ్యర్థుల అర్హతలు..



- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి తప్పనిసరిగా భారతదేశ పౌరుడై ఉండాలి. నామినేషన్ దాఖలు చేసే సమయానికి 25 ఏళ్లు పూర్తయ్యి ఉండాలి.
- రాష్ట్రంలో ఏదైనా ఓ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.
- పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులైతే నలుగురు, స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థులను 10 మంది ఓటర్లు బలపర్చాలి. బలపరిచే వారు అదే నియోజకవర్గానికి చెందిన ఓటర్లు అయి ఉండాలి.
- ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ. 10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి.
- ఎంపీగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.25 వేలు. ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు రూ.12,500లు డిపాజిట్ చేయాలి.
- నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటలకు ముందు అభ్యర్థులు తప్పనిసరిగా తమ పేరిట ఏదైనా గుర్తింపు పొందిన బ్యాంకులో ఖాతా తెరవాలి. ఆ ఖాతా ద్వారానే తమ ఎన్నికల ప్రచారానికి, ఇతర అవసరాలకు వెచ్చించిన సొమ్ము కు సంబంధించిన లావాదేవీలు నిర్వహించాలి. ఖాతా పుస్తకం ప్రతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నోటరీతో కూడిన అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థి, అతని కుటుంబ సభ్యుల స్థిర, చర ఆస్తుల వివరాలను చూపించాలి. అదే విధంగా కేసుల వివరాలు క్రైం నంబరుతో సహా పొందుపరచాలి.
- ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగానికి రాజీనామా చేయాలి. రాజీనామాను ఆమోదించినట్టుగా ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్‌తో పాటు దాఖలు పరచాలి.
- అభ్యర్థులు ఇంటి, నీటి పన్ను, విద్యుత్ చార్జీ బిల్లు బకాయిలు లేనట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.

## ఐశ్వర్యమంటూ.. ఆరోగ్యమే






కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

అరవై ఏళ్లుగా చూస్తున్న ఇళ్లు ఇప్పుడు మసకమసకగా కనిపిస్తోంది. కంటికి ఎదురుగా ఆడుతున్న మనవళ్లు అంత స్పష్టంగా కనిపించడం లేదు. కొడుకు, కూతురు దగ్గరకు వస్తే గానీ గుర్తుపట్టలేని పరిస్థితి. వయసుడిగిన దశలో కంటికి సత్తువ తగ్గుతుంది. ఆస్పత్రికి వెళ్లి ఆపరేషన్ చేయించుకునే స్థోమత ఉండదు. ఇలాంటి నిస్సహాయ స్థితిలో ఉన్న పేదలకు ప్రభుత్వం అసమాన సాయం చేస్తోంది. వైఎస్సార్ కంటి వెలుగు పేరిట పూర్తి ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తూ చూపు అందిస్తోంది. పరీక్ష నుంచి శస్త్ర చికిత్స వరకు, మందుల నుంచి కళ్లద్దాల వరకు అన్ని దశల్లోనూ అండగా నిలుస్తోంది.

అభివృద్ధి పథం సంక్షేమ రథం

అరసవల్లి / ఇచ్ఛాపురం రూరల్/ఎచ్చెర్ల క్యాంపస్/ఆమదాలవలస : అంధత్వ నివారణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం 2019లో 'డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రారంభించింది. కంటిచూపు సరిగా లేని వారికి అందులోనూ పేదలకు, విద్యార్థులకు, ముఖ్యంగా వృద్ధులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే పూర్తి బాధ్యతను తీసుకుని చికిత్స అందిస్తోంది. ఇప్పటికే మూడు దశల్లో ఈ కార్యక్రమాన్ని లక్షలాది మందికి చేరువచేసింది. వివిధ సర్వేల ఆధారంగా 60 ఏళ్లు దాటిన వారిని గుర్తించి వారి పరిధిలోని గ్రామ/వార్డు సచి వాలయాలకు జాబితాను పంపించి కంటి పరీక్షలకు షెడ్యూల్‌ను అమలు చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో ప్రాథమిక పరీక్షల్లో ఆప్తమాలజిస్టుల పర్యవేక్షణలో విడివిడిగా రెండు కళ్లను పరీక్షించి..(స్క్రీనింగ్) సమస్యలను గుర్తించి..మందులతో నయమయ్యేవారు, కళ్ల అద్దాలు అవసరమయ్యేవారు, శుక్లాల సమస్యలున్నవారికి ఆపరేషన్లు చేయించుకోవాల్సినవారు .. ఇలా వేర్వేరుగా గుర్తించేలా చర్యలు చేపడతారు. ఇవన్నీ ప్రభుత్వం తరఫునే ఉచితంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

- కంటి వెలుగుతో లక్షల మందికి నేత్ర పరీక్షలు
- స్క్రీనింగ్, సర్జరీలతో బాధితులకు చూపు
- 60 ఏళ్లు దాటిన వారిలో 3.13 లక్షల మందికి స్క్రీనింగ్ పూర్తి
- 18,002 మందికి విజయవంతంగా ఆపరేషన్లు





అలాగే ఈ కార్యక్రమంతో పాటు రెండు విడతలుగా పూర్తయిన జగనన్న ఆరో గ్య సురక్షలో కూడా వేలాది మందికి కంటి పరీక్షలను నిర్వహించారు.

**స్క్రీనింగ్, సర్జరీలపై 'దృష్టి'**

జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి పర్యవేక్షణలో వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమాన్ని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో కూడా కొనసాగించారు. దీంతో జిల్లాలో చాలా మంది ఇళ్లకే పరిమితమైన కంటి రోగులకు ఇప్పుడు కాటరాక్ట్ సర్జరీలతో, కంటి అద్దాలతో..కంటి చూపు వచ్చినట్లైంది.

**ఇప్పటివరకు 3,13,552 మందికి స్క్రీనింగ్ పరీక్షలను జరిపించారు.**

**18,002 మందికి కాటరాక్ట్ సర్జరీలు చేసి చూపు ప్రసాదించారు.**

**సుమారు 66,375 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.**

### పేద ప్రజలకు వరం వైఎస్సార్ కంటి వెలుగు

మేధావి మాట



ప్రస్తుతం కంటి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. 50 ఏళ్ల తర్వాత శస్త్ర చికిత్సలు అవసరమవుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేకించి వైఎస్సార్ కంటి వెలుగు పథకం తీసుకు రావటం, గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వ హించటం, అవసరమైన వారి కి శస్త్ర చికిత్సలు చేయటం మంచి కార్యక్రమం. పేదలకు ఇదో వరం.

– ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, పూర్వపు వైస్ చాన్స్‌లర్, బీఆర్ఏయూ

### ఉచితంగా ఆపరేషన్ చేశారు



నాకు 80 ఏళ్లు దాటుతున్నాయి. చాలా రోజులుగా కళ్లు మసకగా కనిపిస్తున్నాయి. కంటి ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేసుకోవాలంటే డబ్బులు ఖర్చవుతాయని వైద్యులు తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి నాది. వైఎస్సార్ కంటి వెలుగులో వైద్యులు మా గ్రామానికి వచ్చి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు కళ్లద్దాలు, మందులు కూడా ఇచ్చారు. నా పెద్ద కొడుకు లాంటి జగన్‌మోహన్‌రెడ్డి పది కాలాలు పాటు ఉండాలి, నాలాంటి నిరుపేదలకు రక్షణగా నిలవాలి.

– బలగ భాగ్యమ్మ, బొరివంక, కవిటి మండలం

### సొంత కొడుకులా ఆదుకున్నారు..



రెండేళ్లుగా నాకు కంటి చూపు సరిగా లేదు. నన్ను ఆస్పత్రికి తీసుకువెళ్లే వారు ఎవరూ లేరు. అలాంటి సమయంలో వైఎస్సార్ కంటివెలుగు అని కంటి పరీక్షలు చేస్తామని మా గ్రామం కృష్ణాపురానికి కొందరు వైద్యులు వచ్చారు. పెద్ద యంత్రాలతో పరీక్షలు జరిపారు. వారే స్వయంగా నన్ను తీసుకుకొని వెళ్లి రెండు కళ్లకు ఆపరేషన్ చేయించి ఇంటికి తీసుకువచ్చారు. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది. వైఎస్ జగన్ నా సొంత కొడుకులా ఆదుకున్నారు.

– మొదలవలస రమణమ్మ, ఆమదాలవలస

### ప్రవేశ పరీక్షకు సిద్ధం కావాలి

గార: రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది పాఠశాల, ఇంటర్, డిగ్రీలో ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీన జరిగే ప్రవేశ పరీక్షకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని వమరవల్లి గురుకుల ప్రిన్సిపాల్ చిట్టితల్లి ఓ ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలో జరిగే ప్రవేశ పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లను విద్యార్థి ఐడీ, పుట్టిన తేదీతో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పాఠశాలలో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశం కోసం ఏపీఆర్ఎస్ సీఏటీ–2024 ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్–2024 కోసం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు జిల్లా కేంద్రంలో పరీక్ష జరుగుతుందన్నారు.

### జీడి పరిశ్రమల్లో ప్రమాదాలపై అవగాహన



పలాస ఇండస్ట్రియల్ ఎస్టేట్ జీడి పరిశ్రమలో అవగాహన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ అనంతపురం, ఇండస్ట్రియల్ పార్కులో జీడి కార్మికులకు, సిబ్బందికి, పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కాశీబుగ్గ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో అగ్నిప్రమాద వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జీడి పరిశ్రమలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని పరిశ్రమకు నలువైపులా అత్యవసర దారులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి బి.సోమేశ్వరరావు, సిబ్బంది రమేష్‌నాయుడు, యుగంధర్, ప్రేమ్‌కుమార్, మన్మధరావు, రామనాయుడు, వల్లభరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 'ఉద్దానంలో కలెక్టర్ పర్యటించాలి'

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో ఉన్న రైతుల సమస్యలపై కలెక్టర్ పర్యటించి తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని పౌరహక్కుల సంఘ నేతలు కోరారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తాళభద్ర గ్రామ సమీపంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్దానంలో పండుతున్న జీడి, కొబ్బరి పంట గిట్టుబాటు ధర కోసం పాలకుల దృష్టికి తీసుకుని వెళ్లామని, అయినా ఫలితం లేదని అన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున జిల్లాలోని యంత్రాంగం, కలెక్టర్ మొదలు కింద స్థాయి అధికారులంతా తక్షణమే ఈ ప్రాంతాల్లో పర్యటించి ఒక నివేదిక రాష్ట్రస్థాయి వ్యవసాయ అధికారులకు పంపాలని కోరారు. తాగునీరు, సాగునీరు, పండిన పంటకు గిట్టుబాటు ధరపై స్పందించాలని కోరారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేస్, ఉపాధ్యక్షులు రామారావు, కార్యదర్శి పిండి వెంకట్రావు సహాయక కార్యదర్శి సోమనాదం, జిల్లా కమిటీ సభ్యులు పూర్ణచంద్రరావు, దున్న కృష్ణారావు, లక్ష్మణ్, వైకుంఠరావు, ఢిల్లీరావు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

### 26 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యం పంచాయతీ కేకేనాయుడుపేట గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 26 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చిరంజీవి తన సిబ్బందితో కలిసి మద్యం నిల్వలు గుర్తించారు. కె.గోపాల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

### గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన



ఎం. సున్నాపల్లిలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న గోవిందరావు

సంతబొమ్మాళి: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల సంఘం ఉత్తరాంధ్ర సమన్వయకర్త డి.గోవిందరావు అన్నారు. మండలంలోని ఎం. సున్నాపల్లిలో రూ.6.50 లక్షల వ్యయంతో కుమారులు, గ్రామస్తులు సౌజన్యంతో నిర్మించిన బైపల్లి వెంకటస్వామి స్మారక గ్రంథాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, సామాన్య ప్రజలకు అవసరమైన పుస్తకాలు, సమాచార పత్రికలు, గ్రంథాలతో ఉన్న ఈ గ్రంథాలయాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో బైపల్లి మోహనరావు, గ్రామ పెద్దలు నరసింహులు, టి. ఎర్రన్న, పలువురు యువకులు పాల్గొన్నారు.

### నడక పోటీ విజేతకు అభినందన



నళినీ సుధాకర్‌ను అభినందిస్తున్న స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని రైల్వే క్రీడా ప్రాంగణంలో ఈ నెల 13న నిర్వహించిన జాతీయస్థాయి నడక పోటీల్లో శ్రీకాకుళం జిల్లావాసి నళినీ సుధాకర్‌కు కాంస్య పతకం లభించింది. ఈ సందర్భంగా బుధవారం శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నళినీసుధాకర్‌కు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్‌క్లబ్ సభ్యులు ఎస్.జోగినాయుడు, ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

### గ్యాస్ ప్రమాదాలపై అవగాహన



గ్యాస్ ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారులు

సోంపేట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోంపేట అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గౌరీ శంకర్ అపార్ట్‌మెంట్ వద్ద గ్యాస్ ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదాలు జరిగేటప్పుడు అప్పటికప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు, సిబ్బంది డి.భాస్కరరావు, కె.భాస్కరరావు, సింహాచలం, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్య..

సార్వత్రిక సమరం దగ్గర పడుతోంది. అభ్యర్థులు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఊళ్లన్నీ చుట్టేస్తూ జనాలకు దగ్గర కావడానికి ప్రయత్నిస్తున్నారు. శ్రీరామ నవమి నాడు కూడా ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నారు.



శ్రీకాకుళం ఎన్నికల ప్రచారంలో భారీ ర్యాలీగా వెళ్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఆమదాలవలస రూరల్: నెల్లిపర్తిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సారవకోట: అవలింగిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: కోఠంగిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కంచిలి: అంపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఇచ్ఛాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ

## 19న ఎంపీ అభ్యర్థి తిలక్ నామినేషన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

- వైఎస్ జగన్ గెలుపును ఎవరూ ఆపలేరు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా ఈ నెల 19న తాను నామినేషన్ వేయనున్నానని ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ తెలిపారు. నామినేషన్‌కు స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులతో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని గ్రాండ్ హోటల్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి ఫంక్షన్ హాలు నుంచి కలెక్టరేట్ వరకు ఈ నెల 19న ర్యాలీ నిర్వహించి జిల్లాలోని పార్లమెంటరీ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గ శాసన సభ అభ్యర్థులు, ముఖ్యనేతలతో కలసి వెళ్లి కలెక్టరేట్‌లో నామినేషన్ వేయనున్నామని తెలిపారు. తనను ఎంపీగా అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి ఎందరో ఆదరిస్తున్నారని, ప్రచారంలోనూ అభిమానిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్ గెలుపును ఆపడం ఎవరి తరం కాదన్నారు. సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని చెబుతున్నాయన్నారు. వైఎస్సార్ హయాంలో జిల్లాకు రిమ్స్‌హాస్పటల్, అంబేడ్కర్ యూనివర్సిటీ వంటివి తీసుకొచ్చిన ఘనత మంత్రి ధర్మాన ప్రసాదరావుది అని అన్నారు. కిడ్నీ బాధితులకు భరోసా కల్పిస్తూ రూ.70 కోట్లతో రీసెర్చ్ సెంటర్, రూ.700 కోట్లతో 800 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. మూలపేట పోర్టు నిర్మాణంతో జిల్లాలో వలసలు ఆగిపోతాయని అన్నారు. టీడీపీ ఒక్క శాశ్వత ప్రాజెక్టయినా జిల్లాకు తెచ్చిందా అని అని ప్రశ్నించారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుకు అధికార యావ తప్ప... ప్రజల ఇబ్బందులు వారికి పట్టవన్నారు. 25 ఏళ్లు అధికారమిస్తే టీడీపీ శ్రీకాకుళం జిల్లాకు ఏం చేసిందని ప్రశ్నించారు. ఎంపీకి, అచ్చెన్నాయుడుకు ఓట్లు అడిగే అర్హత లేదని మండిపడ్డారు. సమావేశంలో కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, టెక్కలి నియోజకవర్గ పరిశీలకులు కాయల వెంకటరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షులు ఎంవీ స్వరూప్, చింతాడ రవి, కొండబాబు, కణితి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రగాయాలతో ఉన్న సింహాచలం



గాయాలతో ఉన్న బి.రమణ

బూర్జ: మండలంలో గల ఉప్పినివలస గ్రామం కోనేరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలియజేసిన సమాచారం మేరకు.. వైకుంఠపురం గ్రామానికి చెందిన తమ్మినేని సింహాచలం రోజు లాగానే పాలు అమ్ముకోడానికి సైకిల్‌పై ఉప్పినివలస వెళ్తున్నాడు. అదే మండలం కొల్లివలస గ్రామానికి చెందిన బూరవెల్లి రమణ బైక్‌పై వచ్చి వెనుక నుంచి సింహాచలం సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఇద్దరికీ తలకు గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు క్షతగాత్రులను గుర్తించి 108 కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి వారిని శ్రీకాకుళంలోని మెడీకవర్‌కు తీసుకెళ్లారు.

సింహాచలం తలకు బలమైన గాయం తగలడంతో సీరియస్‌గా ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆస్పత్రి నుంచి పోలీసులకు సమాచారం అందింది.

## అగ్ని ప్రమాదంలో మూడిళ్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కాలిపోతున్న జీడితోట

టెక్కలి రూరల్: స్థానిక కంద్రవీధిలో బుధవారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో మూడు ఇళ్లు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కంద్రవీధికి చెందిన అనంత కార్తీక్ బెహరా ఇంటిలో ముందుగా మంటలు రేగాయి. అనంతరం ఆ ఇంటికి ఇరువైపులా ఉన్న అనంత ఉపేంద్ర బెహరా, అనంత అమర్ బెహరాలకు చెందిన ఇళ్లకు సైతం మంటలు వ్యాపించాయి. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక అధికారి ఎస్.మల్లేశ్వరరావు తెలిపారు. దాదాపు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని చెప్పారు.

**అగ్ని ప్రమాదంలో జీడితోట దగ్ధం**

మెళియాపుట్టి: మండలంలోని మెళియాపుట్టి రెవెన్యూ పరిధిలోని సుమారు ఎకరా జీడితోట మంటల్లో కాలిపోయినట్లు బాధితురాలు నక్క ముత్యాలమ్మ తెలిపారు. బుధవారం సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు విషయం తెలుసుకుని వెంటనే టెక్కలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో.. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని బాధితురాలు తెలిపారు.

### విజయ గణపతికి అష్టోత్తర శత దీపారాధన



విజయ గణపతికి దీపారాధనలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పాలకొండ రోడ్డులోని విజయగణపతి దేవాలయంలో స్వామికి అష్టోత్తర శత దీపారాధనలు బుధవారం జరిగాయి. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శత దీపారాధనలు జరిగాయి. భక్తులు పాల్గొన్నారు.

### సేవాభావం చాటుకున్న ఎమ్మెల్యే తనయుడు



గాయాల పాలైన బాలికను కొత్తూరు సీహెచ్‌సీలో చేర్పించి వైద్యం అందిస్తున్న రెడ్డి ఓం శ్రీకృష్ణ

కొత్తూరు: స్థానిక కాలేజీ రోడ్డులో బుధవారం కొత్తూరుకు చెందిన అక్కాతమ్ముళ్లు ఇద్దరు సైకిల్‌పై వెళ్తూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో బాలికకు గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు రెడ్డి ఓం శ్రీకృష్ణ బాలికను తన కారులో ఎక్కించుకుని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ దగ్గరుండి వైద్యం చేయించారు. ఎమ్మెల్యే తనయుడు చూపించిన మానవత్వానికి స్థానికులు ముచ్చటపడ్డారు.

### ఉత్సాహంగా క్రీడా జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్, క్రికెట్ జట్ల ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా బాలబాలికల అండర్-18 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు జరిగాయి. తుది జట్లను ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19 నుంచి 22 వరకు కృష్ణా జిల్లా నూజివీడులో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి తెలిపారు. ఎమ్మెస్సార్ క్రీడా జట్లకు పోటీలకు వెళ్లేందుకు అవసరమయ్యే ఆర్థిక సాయాన్ని అందజేశారు.

**జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక..**

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి అండర్-19 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. త్వరలో ఎంపికైన క్రీడాకారుల జాబితాను వెల్లడిస్తామని జిల్లా క్రికెట్ సంఘ బాధ్యులు తెలిపారు. జిల్లా క్రికెట్ సంఘం మెంటార్ ఇలియాస్ మహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈఎంపికల్లో సెలెక్టర్లు ప్రాబబుల్స్ జాబితాను ఖరారుచేశారు. శైలానీ, ఆర్సీ రెడ్డి, దీపక్‌కుమార్, కోచ్ కె.సుదర్శన్, ఆనంద్‌కుమార్, వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నాయకుల చేరిక



జె. శాసనాంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ

కంచిలి: మండలంలోని జె.శాసనాం గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 20 కుటుంబాలు ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. జె.శాసనాం గ్రామంలో చేరిన వీరిని పిరియా విజయ సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మర్ల మోహనరావు, గార తులసీదాసు, సైని నాగేశ్వరరావు, మర్ల తాతారావు, జుత్తు సూర్యనారాయణ, కోరుబిల్లి గణేష్, జుత్తు ఢిల్లీరావు, మర్ల ఆనంద్, దున్న సూరిబాబు, మర్ల తులసీదాస్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గుడ్డిపద్ర వేణు, ఎంపీటీసీ సభ్యుడు దుర్గాసి మాధవరావు తదితరులు ఉన్నారు.

## 'జగనన్న పరిపాలనకు ఆకర్షితులై చేరాం'



జాడుపూడి కాలనీకి చెందిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

కంచిలి: ఐదేళ్లపాటు జగనన్న ప్రభుత్వ పరిపాలనకు ఆకర్షితులపై స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరామని మండలంలోని జాడుపూడి గ్రామానికి చెందిన వారు అన్నారు. జాడుపూడి పంచాయతీ జాడుపూడి కాలనీకి చెందిన బేడ, బుడగ, పూసల, రజక వర్గాలకు చెందిన వారు టీడీపీని వీడి బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తమతో పాటు మరో 500 కుటుంబాలు కూడా వైఎస్సార్‌సీపీ పాలనను ఇష్టపడి పార్టీలో చేరాయని వారు పేర్కొన్నారు. వీరిని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ బల్లిపుట్టుగలోని తన స్వగృహంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. చేరిన వారిలో అయితం వైకుంఠరావు, మల్రిపూడి భైరాగి, గంట మల్లేష్, గంట వేమరాజు, మిర్యాల వెంకటరావు, రమణమూర్తి, బోయశెట్టి సన్యాసి, బోయశెట్టి సాయి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జాడుపూడి పార్టీ నేతలు పలికల జయరాం, జామి సూకయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి

శ్రీకాకుళం రూరల్: అప్పుల బాధ తాళలేక వప్పంగి గ్రామానికి చెందిన మంత్రి శ్రీధర్(38) బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ వాసుదేవరావు అందించిన వివరాలు మేరకు.. వప్పంగి గ్రామానికి చెందిన మంత్రి శ్రీధర్ నగరంలోని డేఅండ్‌నైట్ కూడలిలో నాయుడు ట్రేడర్స్ అనే పురుగుల మందు షాపును నడుపుతున్నాడు. ఈయనకు మాధవి అనే మహిళతో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కొడుకు ఉన్నాడు. కొంతకాలంగా శ్రీధర్ అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. వ్యాపారం కూడా సరిగ్గా నడవడం లేదు. దీంతో మంగళవారం రాత్రి షాపు కట్టేసి తన బైక్‌పై మునసబుపేట వద్ద గల ఓ ప్రైవేటు లేవుట్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన కొంత మంది యువకులు చూసి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి పక్కన ఉన్న ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా వప్పంగి వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.